ప్రజాశక్తి
సోమవారం 8 జూలై 2024



అల్లూరి సీతారామరాజు

గర్భిణికి తప్పని అవస్థలు

కాలినడకన ఆసుపత్రికి..

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని అతి మారుమూల మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన బూసిపుట్టు పంచాయతీకి చెందిన ధోనిపుట్టు గ్రామానికి వైద్యం కోసం వెళ్లేందుకు అవస్థలు పడింది. గర్భిణీ పాంగి లక్ష్మికి పురిటి నొప్పులు రావడంతో రహదారి సౌకర్యం లేక వాహనాలు గ్రామానికి రాలేదు. దీంతో, గ్రామం నుండి సంత వీది గ్రామం వరకు ఆశా వర్కర్, కుటుంబ సభ్యుల సహాయంతో ఆ గర్భిణీని కాలి నడకన సుమారు రెండు కిలోమీటర్లు దూరం తరలించారు. అక్కడి నుండి 108 వాహనంలో రూడకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లగా సిబ్బంది లేక పోవడంతో ముంచింగిపుట్టు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.



కాలినడకన వెళ్తున్న గర్భిణి

పిల్లల చదువు కోసం పాట్లు

- పలు గ్రామాల్లో చందాలు వేసుకుని.. పాఠశాలల రేకుల షెడ్డుల నిర్మాణాలు

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు: కెందుగూడలో పాఠశాల భవనం లేక పోవడంతో ఆ గ్రామస్తులు చేయి చేయి కలిపి రేకుల షెడ్డు నిర్మాం చేపడుతున్నారు. గ్రామంలో పివిటిజి తెగకు చెందిన పిటిజి కోదు, పొర్జ, గౌడు తెగలకు చెందిన వారు ఉన్నారన్నారు. మండలంలోని మారుమూల ప్రాంతమైన కుమడ పంచాయతీకి చెందిన కెందుగూడ గ్రామంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాలలో సుమారు 34 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ పాఠశాల భవనం మంజూరు చేయక పోవడంతో విద్యాబోధన జరగ లేదని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల భవనం లేక వర్షాకాలంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. దీంతో, తల్లిదండ్రులు మట్టి గోడ వేసి రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో, జిల్లా విద్యాశాఖ అధికారి, మండల విద్యాశాఖ అధికారిలు స్పందించి పాఠశాల భవన నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.



ముంచంగిపుట్టు మండలం కెందుగుడ పాఠశాల షెడ్డును నిర్మిస్తున్న గ్రామస్తులు, పిల్లలు



అనంతగిరి మండలం టెంకలబందలో పాఠశాల షెడ్డును నిర్మిస్తున్న గ్రామస్తులు

అనంతగిరి: కివర్ల పంచాయతీ పరిది టెంకలబంద గ్రామం నుండి రెండిన్నర కిల్లో మీటర్ల దూరంలో ఉన్న గంగవరం ప్రాథమిక పాఠశాలకు వర్షా కాలంలో గెడ్డలు దాటి విద్యార్థులు వెళ్ల లేక పోతున్నారు. టెంకలబంద గ్రామంలో ఉపాధ్యాయుడును నియమించాలని జిల్లా కలెక్టర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఉపాధ్యాయుడిని నియమించడంతో గ్రామస్తులు ముందుకు వచ్చి తాత్కాలిక రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకుంటున్నారు. చందాలు వేసుకుని పనులు చేపడుతున్నారు, తక్షణమే ప్రభుత్వం పాఠశాల నిర్మాణానికి నిదులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ నిధి
సాయం అందజేత



సంక్షేమనిధి చెక్కును అందజేస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి-చింతూరు : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌లో సభ్యులుగా ఉండి మృతి చెందిన మీనా కబ్బారావు కుటుంబానికి యుపెఫ్ కుటుంబ సంక్షేమ నిధి నుంచి రూ.3లక్షల సాయం చెక్కును ఆదివారం సంఘం నేతలు అందజేశారు. 1998లో ఉద్యోగంలో చేరి చింతూరు మండలంలోని సుకుమామిడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ ఏప్రిల్ 13న మీనా కబ్బారావు మృతి చెందారు. ఈ నేపథ్యంలో మృతుని భార్య సుజాతకు యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ నిధి సాయాన్ని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యన్. గోవిందరాజులు, జిల్లా అధ్యక్షులు వై.విల్సన్‌బాబు, .జిల్లా.ప్రధాన కార్యదర్శి వి. మహేశ్వరరావు అందజేశారు.ఈ సందర్భంగా యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు (కాకినాడ) మాట్లాడుతూ యుటిఎఫ్.సంఘంలో చేరి కుటుంబ సంక్షేమ నిధి పథకం లో ఉన్న సభ్యుడు ఎవరైనా అకస్మాత్తుగా మరణిస్తే, వారి కుటుంబా నికి ఆర్థికంగా చేయూత అందుతుందన్నారు.

10న డిమాండ్స్ డేను జయప్రదం చేయండి: సిఐటియు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, స్కీం వర్కర్స్ అందరికీ ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న డిమాండ్స్ డే ను నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జన్ని భగత్ రామ్ తెలిపారు. ఆదివారం అరకువేలి ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో సిఐటియు మండల కార్యవర్గ సభ్యుడు సాగర ప్రభుదాస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ రామ్ మాట్లాడుతూ, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి దృష్టి పెట్టాలని తెలిపారు. రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో స్కీం వర్కర్లపై తొలగింపులకు పాల్పడుతున్నట్లు తెలిసిందని, ఈ చర్యలు మానుకోవాలన్నారు. డిమాండ్స్ డేను కార్మికులు, కర్షకులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షులు పి.వెంకటలక్ష్మి, జిసిసి సోప్ యూనిట్ నాయకులు సింహాద్రి, మండల కోశాధికారి, కొర్ర మగ్గన్న, తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: ఈనెల 10న జరిగే కార్మిక కర్షకుల డిమాండ్స్ డేను జయప్రదం చేయాలని సిఐటియు పిలుపు నిచ్చింది. ఆదివారం ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో సిఐటియు మండల కమిటీ సమావేశం పి. మంజుల అధ్యక్షతన జరిగింది. అనంతరం డిమాండ్స్ డే కర్ర పత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి కిల్లో మోస్య, సిఎస్ కళావతిలు మాట్లాడుతూ, జూలై నెల నుంచి అంగన్వాడీలకు వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్ల పై రాజకీయ ఒత్తిళ్లు అరికట్టాలన్నారు. ఈనెల 10న మండల కేంద్రంలో నిరసన చేపడతామని, అధిక సంఖ్యలో కార్మికులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సుమిత్ర, చిలకమ్మ, హరికృష్ణ, అప్పలస్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు నేత భగత్ రామ్

ఇసుక దోపిడీ శకం ముగిసింది

నేటి నుంచి ఉచితంగా సరఫరా : ఎమ్మెల్యే శిరీషాదేవి



చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, తాపీమేస్త్రీలు

ప్రజాశక్తి-రంపచోడవరం : ఇసుకను దోపిడి చేసి, ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వైసిసి జగన్ ముగిసిపోయిందని, ఈనెల 8నుంచి ఉచిత ఇసుక ప్రజలకు అందుబాటులోకి రానుందని స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేస్తామన్న హామీల్లో భాగంగా ఉచిత ఇసుక సరఫరాను అమలు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ తాపీ మేస్త్రీల సంఘం నేతలు ఆధ్వర్యంలో రంపచోడవరంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఉముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు ఎమ్మెల్యే శిరీషాదేవి, తెలుగు యువత అధ్యక్షుడు భాస్కర్ ఇతర కూటమి నేతలు, తాపీమేస్త్రీల సంఘ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీషాదేవి మాట్లాడుతూ, ఇసుకను ఇకనుంచి కొనుక్కోవాల్సిన పనిలేదని,లోడింగ్, రవాణా ఛార్జీలు చెల్లించి ఉచితంగా పొందవచ్చన్నారు. లక్షలాది మంది భవన యజమానులు, కార్మికులు, మేస్త్రీలకు ఇది శుభకరమైన వార్త అన్నారు. కార్యక్రమంలో తాపీ మేస్తిల సంఘం నాయకులు, మేస్త్రిలు, కూటమి పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు..

నేటి నుంచి ఇసుక అమ్మకాలు

- మెట్రిక్ టన్ను రూ.300

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో ఈనెల 8వ తేదీ సోమవారం నుండి ఇసుక అమ్మకాలను ప్రారంభిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాలు, మైన్స్ అండ్ జియాలజీ కమిషనర్ సూచనల మేరకు జిల్లాస్థాయి కమిటీలో చర్చించి అందరికీ అందుబాటులో ఉండే విధంగా ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా అత్యంత పారదర్శకంగా గిరిజన సంఘాల ద్వారా ఇసుక అమ్మకానికి నిర్ణయించినట్లు తెలిపారు. ఎటపాక మండలంలో గుండాల-1 డిపోలో 87,800 మెట్రిక్ టన్నులు, గుండాల-2 డిపోలో 79,026 మెట్రిక్ టన్నులు కలిపి మొత్తం 1,66,826 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని వివరించారు. అవసరమైన ప్రజలు ఈ ఇసుకను మెట్రిక్ టన్నుకు 300 రూపాయలు చొప్పున చెల్లించి పొందవచ్చు అన్నారు. ఇసుక కొనుగోలు చేసిన వినియోగదారులు వారి స్వంత ఖర్చులతో తరలించుకోవచ్చని, రవాణా ఛార్జీలు మెట్రిక్ టన్నుకు కిలోమీటర్‌కు ఐదు రూపాయల ధర నిర్ణయించినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు.

అధ్వాన రహదారితో అవస్థలు

- రవాణాకు ఇబ్బందులు పడుతున్న పివిటిజి గిరిజనులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని అరమ పంచాయతీ పోడుజోల, బయలువలస గ్రామాల్లోని మట్టి రోడ్డు వర్షాకాలంలో అధ్వానంగా ఉండటంతో ఆ గ్రామాల పివిటిజి గిరిజనులు రవాణాకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మట్టి రోడ్డు కావడంతో వర్షాలు కురిసినప్పుడు రోడ్డంతా బురద మయంగా మారుతుండంతో గిరిజనులు కాలిబాటన నడిచి వెళ్లడానికి, ఆటోలు, ద్విచక్ర వాహనాలతో రవాణా చేయాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రతి ఏడాది నిత్యం వర్షాకాలంలో ఇదే పరిస్థితి ఉంటుందని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి గతంలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయడంతో సంబంధిత శాఖ అధికారులు గ్రామాలను సందర్శించారు. ఇప్పటికీ నిర్మాణం చేయలేదని పివిటిజి గిరిజనులు తెలిపారు. గుంటసీమ రోడ్డు పరిధి జంక్షన్ నుంచి పూడుజోల మీదుగా బయలువలస వరకు సుమారు రెండు కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంటుంది. పివిటిజి గ్రామాలు కావడంతో అధికారులు కూడా ఆ గ్రామాలకు రోడ్డు నిర్మించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో రోడ్డు బురదమయంగా మారి అద్వానంగా ఉండడంతో అనారోగ్యానికి గురైన వ్యాధిగ్రస్తులను కూడా రాత్రివేళల్లో హాస్పిటల్ కు తరలించడానికి తీవ్ర కష్టాలు పడుతున్నామని గిరిజనులు అంటున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో తారు రోడ్డు నిర్మించాలని పివిటిజిలు కోరుతున్నారు.



బురదగా ఉన్న రహదారి

వర్షాకాలంలో ఇబ్బంది పడుతున్నాం

తారు రోడ్డు సౌకర్యం లేక పోవడంతో వర్షాకాలంలో పోడు జోల, బయలు వలస గ్రామస్తులు రవాణాకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు నిర్మించాలని గతంలో జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేయగా సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు వచ్చి రోడ్డుని కొలిచి ఎస్టిమేషన్ వేసుకుని వెళ్లారు. కానీ ఇప్పటికీ ఎటువంటి పనులు ప్రారంభించక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. తక్షణమే అధికారులు స్పందించి తారు రోడ్డు నిర్మించి రవాణా కష్టాలు తీర్చాలని కోరుతున్నాం.



పి సుబ్బారావు. మాజీ సర్పంచ్, పోడుజోల గ్రామం

పోలవరం నిర్వాసితుల సమస్యలపై
శ్వేతపత్రం విడుదల చేయాలి

- నిర్వాసితుల సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి- విఆర్.పురం: పోలవరం ప్రాజెక్టుపై శ్వేతపత్రం విడుదల చేసిన చంద్రబాబు ప్రభుత్వం, నిర్వాసితుల సమస్యలపై కూడా వైట్ పేపర్ రిలీజ్ చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని రేఖపల్లి గ్రామంలో ఎస్‌డిఎస్ ప్రాంగణంలో సిపిఎం ఆధ్వర్యంలో కుంజా నాగిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పోలవరం నిర్వాసితుల సమస్యలపై మండల స్థాయి సదస్సులో మాట్లాడుతూ, గత జగన్ ప్రభుత్వం నిర్వాసితులను, వారి సమస్యలను గాలికొదిలేసిందని, ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం ప్రాజెక్టు పనులపై శ్వేతపత్రం విడుదల చేసిందే తప్ప నిర్వాసితుల సమస్యలపై మాట్లాడటం లేదన్నారు.

నిర్వాసితుల నష్టపరిహారం, భూపరిహారం ఇతర సమస్యల పైన శ్వేత పత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న ఆర్అర్ ప్యాకేజీ, కొందరు నిర్వాసితులకు అందని భూనష్టపరిమారం, ముఖ్యంగా ఆదివాసీలు సాగు చేస్తున్న డి ఫారం పట్టా భూములకు నష్ట పరిహారం చెల్లింపుపై ఇప్పటి వరకు నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంపై ప్రభుత్వం స్పందించాలన్నారు. అలాగే పొగాకు, మిర్చి, వరి మొదలైన లాభదాయక పంటలు పండించే సారవంతమైన భూములకు సైతం ఇతర భూముల మాదిరిగా ఒకే పరిహారం చెల్లించడం దుర్మార్గమన్నారు. నిర్వాసితుల భూములకు కూడా పట్టిసీమ తరహా నష్టపరిహారం, ప్యాకేజీ చెల్లించాలని డిమాండ్ చేశారు.



నిర్వాసితుల సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

వరద ముంపునకు గురవుతున్న కన్నాయిగూడెం, మరికొన్ని పునరావాస కాలనీలలో డ్రైనేజీలు, సిసిరోడ్ల నిర్మాణం ఇంకా పూర్తికాలేదని, చేపట్టిన పనుల్లో నాణ్యతాలోపంపై అధికారులు, నేతలు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం నాణ్యమైన పూర్తి పునరావాస కాలనీలు నిర్మించాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన కటాఫ్ తేదీ 2017 దాటిపోయి ఏడేళ్ల గడిచినా నిర్వాసితులకు సురక్షిత కాలనీలకు పంపే పరిస్థితి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఆనాటికి 18ఏళు నిండిన వారికి ఇచ్చే పునరావాసం, ఇళ్లు ఆర్అర్ ప్యాకేజీని, అప్పటికి ఒకటిరెండు నెలలు, రోజుల తేడాలో 18ఏళ్లు నిండనున్న వారికి ప్రభుత్వ సాయం అందకపోవడంతో వారికి న్యాయం చేయాలని కోరారు. నిర్వాసితులను నేటికీ పునరావాస కాలనీలకు తరలించలేదని, ప్రభుత్వం బాధితులను ఎపుడు తరలిస్తుందో ఆ నాటికి 18ఏళ్లు నిండిన వారందరికీ ఆర్అర్ ప్యాకేజీ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం గతంలో వేసిన కాంటూరు లెక్కలు తప్పుడు తడకలుగా ఉన్నాయని, ఆ తర్వాత వచ్చిన లేడార్ సర్వే కూడా ముంపు గ్రామాలను గుర్తించడంలో విఫలమైందన్నారు. ఇప్పటికైనా గ్రామసభల ద్వారా సరైన సర్వేలు నిర్వహించి ముంపునకు గురయ్యే అన్ని గ్రామాల ను గుర్తించి అందరిని ఆదుకోవాలని కోరారు. సదస్సులో పార్టీ జిల్లా నాయకులు పూనెం.సత్యనారాయణ, సోయం చినబాబు, ఎంపిపి కారం లక్ష్మి పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు పంకు. సత్తిబాబు, మండల నాయకులు పులి.సంతోష్ కుమార్, కదల కొండారెడ్డి, కారం సుందరయ్య వడ్లది రమేష్ నిర్వాసితులు పాల్గొన్నారు.

జనసేనలో పలువురి చేరిక

ప్రజాశక్తి- రంపచోడవరం : మండలంలోని ఐ.పోలవరం పంచాయతీ ఐర్లపల్లి గ్రామంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లీగల్ సెల్ ఉపాధ్యక్షులు కాకి స్వామి, రంపచోడవరం మండల జనసేన అధ్యక్షులు పిఆర్‌పి.శ్రీను ఆధ్వర్యంలోఅదే పంచాయతీకి చెందిన సోదే వినోద్‌కుమార్ మిత్రబృందం, మహిళలు జనసేనలో చేరారు.ఈ సందర్భంగా జనసేన సీనియర్ నేతలు మాట్లాడుతూ, పార్టీని బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రజలకు ఇతోధిక సేవలను అందించడంతోపాటు రానున్న అన్ని ఎన్నికల్లో జనసేన, కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రంపచోడవరం మండల ఉపాధ్యక్షులు రాగాల సురేష్, రమణి, జిల్లా సంయుక్త కార్యదర్శి నర్సి ఎర్రయ్య, సీతయ్యపాల్గొన్నారు.




జనసేనలో చేరిన ఐర్లపల్లి గ్రామ యువకులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో
ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

ప్రజాశక్తి-చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి డిగ్రీ ఆన్‌లైన్ కోర్సులో అడ్మిషన్స్ ప్రక్రియ ప్రారంభమైందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ .కె. రత్న మాణిక్యం తెలిపారు. మొదటి ధఫా షెడ్యూల్‌లో భాగంగా రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఈనెల 10 తుది గడువని అన్నారు. 11న వెబ్ ఆప్షన్ నమోదు చేసుకోవాలని, 19న సీట్లు కేటాయింపులు జరుగుతాయన్నారు

. చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సకల బోధన సదుపాయాలతో, అత్యున్నత విద్యార్హతలు అనుభవజ్ఞులైన బోధన సిబ్బంది ఉన్నారని ప్రిన్సిపల కె.రత్నమాణిక్యం తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో బిఏ ఆనర్స్ ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్ , బీకాం ఆనర్స్ కంప్యూటర్ అప్లికేషన్స్, కామర్స్, బిఎస్సి ఆనర్స్ ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్, జువాలజీ, బోటనీ గ్రూపులతో కోర్సులు నిర్వహిస్తున్నామన్నారు. కార్పొరేట్ విద్యాలయాలకు ధీటుగా అన్ని హంగులతో డిగ్రీ కోర్సులు చదవడానికి అనువైన ప్రశాంతమైన వాతావరణం కళాశాలలో ఉందని, ఇంటర్ పాసైన విద్యార్థినీ విద్యార్థులు స్వయంగా వచ్చి కళాశాలలోనే ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్నివిద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99492 29236, 99512 37879, 81068 72474 మొబైల్ నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

విఆర్‌ఒ కుటుంబానికి పరామర్శ



గణపతిరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శిరీష

ప్రజాశక్తి-రంపచోడవరం : రెవిన్యూ డివిజన్ కేంద్రం రంపచోడవరం విఆర్‌ఒ మిర్తివాడ గణపతిరెడ్డి కుటుంబాన్ని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, తెలుగు యువత అధ్యక్షుడు విజయభాస్కర్ పరామర్శించారు. విఆర్‌ఒ గణపతిరెడ్డి ఆకస్మిక మరణం సమాచారంతో ఆదివారం వారి ఇంటికి వెళ్లి భౌతికకాయానికి నివాళులర్పించారు. ఉద్యోగ రీత్యా ప్రజాసేవలో తనదైన ముద్ర వేసిన గణపతిరెడ్డి మరణం వారి కుటుంబానికి తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. మాజీ ఎమ్మెల్యే చిన్నంబాబు రమేష్, టిడిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా జగన్నాథ రథయాత్ర


రథాన్ని లాగుతున్న భక్తులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని ఏనుగు రాయి పంచాయతీకి చెందిన కొండపడ గ్రామంలో జగన్నాధుడి రథయాత్ర పండుగను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండలంలోని ప్రజలు వేలల్లో తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయుడు కిముడు ఈశ్వరరావు, ఆలయ కార్యదర్శి లకే నారాయణ, ఆలయ కమిటీ సభ్యులు కిముడు వెంకటరావు, కిముడు దామోదరం, మాలయ్య, సూరిబాబు పాల్గొన్నారు.

కుల ధ్రువపత్రాల మంజూరుకు సర్వే

ప్రజాశక్తి- కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కాలంలో కుల ధ్రువీకరణకై దరఖాస్తులు సుమోటోగా నమోదు చేయడంతో రెవెన్యూ సిబ్బంది గత పక్షం రోజులుగా ధ్రువపత్రాల మంజూరుకై గ్రామాల బాట పట్టారు. ఇందులో భాగంగా ఆదివారం సెలవు దినం అయినప్పటికీ బోడపాలెం గ్రామానికి చెందిన గ్రామ రెవెన్యూ అధికారి రామసాల పెద్దన్న దొర ఉదయాన్నే సర్వే నిమిత్తం గ్రామ బాట పట్టారు. విధి నిర్వహణ పట్ల అంకితభావంతో పని చేసే ఆయన పనితీరు పట్ల గ్రామస్తులు సహా పలువురు మండల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మండల వ్యాప్తంగా సుమారు 4900 వరకు గతంలో ఎన్నడు ఎటువంటి ధ్రువపత్రాలకు దరఖాస్తు చేసుకున్న వారిని ప్రభుత్వం సుమోటోగా గుర్తించింది. అయితే వారికి ధ్రువపత్రాలు అందించేందుకు సర్వే నిర్వహించి గ్రామంలో ఉన్నారా వలస బాట పట్టారా, లేక మృతి చెందారా అనే పలు విషయాల పట్ల సర్వే నిర్వహించి ధ్రువపత్రాలను అందించేందుకు సిద్ధం చేస్తున్నారు. బోడపాలెం గ్రామానికి సంబంధించి 335 దరఖాస్తులను సర్వే చేస్తున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రసాదు, గ్రామ సహాయకుడు రాజబాబు ఉన్నారు.

బస్సుల కోసం రోడ్డుపై పడిగాపులు

ప్రజాశక్తి కోటవురట్ల: మండల కేంద్రం లో ప్రధాన కూడలి వద్ద ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గతంలో బస్సు షెల్టర్, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం అవి ఆక్రమణకు గురి కావడంతో ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సు కోసం రోడ్లపై నిల్చుని ఎండనక వాననక ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. పలుమార్లు గ్రామస్తులు సైతం అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆక్రమణకు గురైన బస్సు షెల్టర్‌ను వినియోగంలోకి తీసుకు రావాలని కోరుకుంటున్నారు.

ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - చీడికాడ: షెడ్యూల్డ్ కులంలో ఏబిసిడి వర్గీకరణ చేస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిల బెట్టుకోవాలని మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోర్తా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో అరుంధతి సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎస్సీ కాలనీలో ఆదివారం మహాజన సోషలిస్టు పార్టీ మండల అధ్యక్షులు రావాడ దేముడు బాబు ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ 30 వ ఆర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. మాదిగ కృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి కేకు కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడితూ, 30 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో. ఎంపీటీసీ రావడ మని, పెదపూడి సూర్యం, రావాడ నాగమ్మ , రావాడ కన్నమ్మ, విశ్వేశ్వరమ్మ,కేశమ్మ, కొండమ్మ పాల్గొన్నారు

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో కేడిపేట ఫీడర్ పరిధిలో జంగిల్ క్లియరెన్స్ సందర్భంగా ఈనెల 8న సోమవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని నర్సీపట్నం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణారావు తెలిపారు. చిన్నయ్యపాలెం, కొత్త మల్లంపేట, అమ్మపేట, గింజర్తి, చోద్యం, లింగంపేట, రామచంద్రపురం తదితర గ్రామాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులంతా ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

అధికారుల ఆదేశాలు బేఖాతరు

అరకులోయలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్లు

ప్రజాశక్తి-అరకులోయ: పర్యాటక కేంద్రమైన అరకులోయలో ప్లాస్టిక్ వాడకం పెరిగి పోతుంది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని ఇటీవల అల్లూరి జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో, పంచాయతీ అధికారులు ప్లాస్టిక్‌ను నిషేధం చాలని ప్రత్యేకంగా అరకులోయలో వర్తకులతో సమావేశాలు ఏర్పాటు చేసి తరచు హెచ్చరిస్తూ నోటీసులు జారీ చేస్తున్నప్పటికీ, ప్లాస్టిక్ కవర్లు కిరాణా షాపుల్లో, మాసం దుకాణాల్లో, భోజన హోటల్స్, టిఫిన్ సెంటర్స్, కూరగాయల దుకాణాల్లో దర్శనమిస్తునే ఉన్నాయి. అధికారుల ఆదేశాలు బే ఖాతాలు చేస్తూ విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తుండడంతో పర్యాటక కేంద్రమైన అరకులోయలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకు పోతున్నాయి.


అరకులోయలోని దుకాణాల్లో ప్లాస్టిక్ సంచుల్లో సరుకులు కట్టి ఇస్తున్న దృశ్యం

ఒకపక్క స్థానిక వ్యాపారులు వివిధ వస్తువులు కొనుగోలు చేసిన కస్టమర్లకు ఇచ్చే కవర్లు, మరోపక్క అరకులోయ సందర్శించే పర్యాటకులు ప్లాస్టిక్ సంచులు తీసుకొచ్చి ఈ ప్రాంతంలో ఎక్కడపడితే అక్కడ పారవేస్తుండటంతో పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పలువురు మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో అరకులోయలో సందర్శించిన రాష్ట్ర హైకోర్టు అప్పటి ఓ ప్రధాన న్యాయమూర్తి కూడా అరకులోయలో ప్లాస్టిక్ వినియోగం ఎక్కువగా ఉండడం గమనించి వీటిపై చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. అయినా ఇక్కడ ఎటువంటి మార్పు కనిపించలేదు. విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్లు వినియోగించడమే కాకుండా ఎక్కడపడితే అక్కడ పారవేస్తుండడంతో ఇటు పర్యావరణానికి తీవ్ర ముప్పు కలగడమే కాకుండా, పశువులు కూడా వాటిని తిని మృత్యువాత పడుతున్న సంఘటనలు ఉన్నాయి. వ్యాపారులకు ఎన్నిసార్లు పంచాయితీ అధికారులు హెచ్చరించినా ప్లాస్టిక్ కవర్లోనే నిత్యావసర సరుకులు, సామాన్లు కట్టి కస్టమర్లకు ఇవ్వడం ఇక్కడ పరిపాటిగా మారిపోయింది.

అరకులోయ పర్యటక కేంద్రాన్ని ప్లాస్టిక్ రహిత కేంద్రంగా తయారు చేయాలని గత కలెక్టర్, పాడేరు ఐటిడిఎ పిఓ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్లాస్టిక్ కవర్లు విక్రయదారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అయినా ఇక్కడి వ్యాపారుల్లో ఎటువంటి చలనం లేకుండా పోవడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దుకాణాలపై దాడులు నిర్వహించి ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని కోరుతున్నారు.

సరికొత్త ఫీచర్లతో ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) 'ఈస్టర్న్ పవర్' మొబైల్ యాప్‌ను సరికొత్త ఫీచర్లతో వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి 'ఈస్టర్న్ పవర్' మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వినియోగదారుని 16 అంకెల సర్వీసు నెంబర్ నమోదు చేసుకోవడం ద్వారా మొబైల్ యాప్ సేవలను పొందవచ్చని పేర్కొన్నారు. ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్‌లో 'బిల్ పే' ఆప్షన్ ద్వారా ద్వారా విద్యుత్ బిల్లులను ఎటువంటి అదనపు రుసుం లేకుండా అత్యంత సులభతరంగా చెల్లించవచ్చని తెలిపారు. అంతేకాకుండా వినియోగదారుని సర్వీసుకు సంబంధించిన విద్యుత్ వినియోగం, బిల్లు వివరాలు, బిల్లు చెల్లింపు, విద్యుత్ సరఫరా పరిస్థితి వివరాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. 'మై యుసెజ్' ఆప్షన్ ద్వారా విద్యుత్ మీటర్‌లో ఉన్న రీడింగ్ ప్రకారం కేవలం ప్రస్తుత వినియోగపు యూనిట్ల సంఖ్యను నమోదు చేయడం ద్వారా విద్యుత్ బిల్లును వినియోగదారులే యాప్ ద్వారా లెక్కించు కోవచ్చని వివరించారు. యాప్ ద్వారా ఆధార్ నంబర్‌కు విద్యుత్ సర్వీసును అనుసంధానం చేసుకోవడంతోపాటు విద్యుత్ సంబంధిత సమస్యలను ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. పాత విధానంలోనే నేరుగా ఫోన్‌పే, పేటీఎం, జీపేల ద్వారా వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు వీలుగా బ్యాంకులతో సంప్రదింపులు జరుపుతున్నామని పృథ్వీతేజ్ తెలిపారు. సంస్థ వెబ్‌సైటు www.apeasternpower.com నుంచి కూడా బిల్లులు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఏపీఈపీడీసీఎల్ మొబైల్ యాప్‌లో గాని లేదా సంస్థ వెబ్‌సైటులో గాని బిల్లులు చెల్లించేటప్పుడు వినియోగదారులు తమ ఫోన్ పే, జీ పే, పే టిఎం, ఇతర యూపీఐ యాప్స్‌తో పాటు నెట్ బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్, వాలెట్స్, క్యాష్ కార్డ్స్ కూడా వాడుకోవచ్చని సిఎమ్‌డి తెలిపారు.

లోకేష్‌ను కలిసిన గోపాలమిత్రలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: రాజధానిలో మంత్రి లోకేష్ నుకలిసి తమ బాధలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు రాష్ట్ర గోపాలమిత్ర అధ్యక్షుడు కిల్లాడ వెంకటరమణ తెలిపారు. నర్సీపట్నంలోని ఆయన నివాస గృహంలో విలేఖరులతో మాట్లాడుతూ, ఏళ్ళ తరబడి పశుసంవర్ధక శాఖలో విధులు నిర్వహిస్తూ పాడి రైతులకు సేవలు అందిస్తున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వం తమ వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. గోపాల మిత్రలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 2500 మంది పనిచేస్తున్నామని, 20 ఏళ్ల క్రితం చంద్రబాబు నాయుడు ఈ వ్యవస్థను స్థాపించారని, కక్షతోనే జగన్ ప్రభుత్వం వివక్ష చూపించిందన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా తమను రెగ్యులర్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు.

నేరాలు ఘోరాలు

గంజాయితో విద్యార్థుల అరెస్టు

ప్రజాశక్తి -గొలుగొండ: ఎర్రన్నపాలెం చెక్ పోస్టు వద్ద తనిఖీలు చేస్తుండగా 2కేజీల గంజాయితో గుంటూరుకు చెందిన ఇద్దరని అరెస్టు చేశామని ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు చేపట్టగా గుంటూరు జిల్లా రేపల్లె గ్రామానికి చెందిన అల్లపర్తి కౌశిక్(21), నంబూరి అభిలాష్(24)లు రెండు కేజీల గంజాయితో పట్టు బడ్డారన్నారు. పట్టుబడిన ఇద్దరు డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులని అయన తెలిపారు. వారి వద్ద నుండి గంజాయితో పాటుగా 1 మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించమన్నారు.

నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి గొలుగొండ: గంజాయి కేసులో పరారీలో ఉన్న నిందితుడిని శనివారం రాత్రి అరెస్ట్ చేసామని గొలుగొండ ఎస్సై కష్ణారావు తెలిపారు. 2021 గంజాయి కేసులో పరారీలో ఉన్న చింతపల్లి మండలానికి చెందిన వంతల ప్రసాదును శనివారం పట్టుకున్నామన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించామని ఆయన తెలిపారు. గంజాయి రవాణా, పేకాట తదితర అసాంఘిక కార్యక్రమాల నిర్వహణ చేపడితే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల పేర్లు గోప్యంగా ఉంచుతామని ప్రజలంతా తమకు సహకరించాలని ఆయన కోరారు.

వసతి గృహానికి డ్రెయినేజీ సౌకర్యం కల్పించాలి

ఐద్వా ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: 28వ వార్డులో జనావాసల మధ్యలో ఉన్న హాస్టల్‌కు డ్రెయినేజీ సౌకర్యం కల్పించాలని ఐద్వా నాయకులు కె.వి.సూర్యప్రభ, ఎల్.గౌరీ మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. ఆదివారం 28వ వార్డులోని నివాస ప్రాంతాల ప్రజలతో కలిసి పీనారిపాలెం జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకులు మాట్లాడుతూ, హాస్టల్‌కు డ్రేనేజ్ సదుపాయం లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపైకి రావడంతో నివాస ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారని తెలిపారు. రోడ్లపై నీరు నిలువ ఉంటుందని, ఈ నీటిలో నుండి వార్డు ప్రజలు నడవడంతో అనేక రోగాలకు గురవుతు న్నారన్నారు. వారం రోజుల వ్యవధిలో సమస్య పరిష్కారం కాకపోతే ఐద్వా, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

బీఎస్పీ పార్టీ నాయకుడు బొట్టా నాగరాజు మాట్లాడుతూ, నివాస ప్రాంతాలలో హాస్టల్ పెట్ట డానికి అధికారులు ఎలా పర్మిషన్ ఇస్తారని ప్రశ్నించారు. వారం రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే హాస్టల్‌కు తాళం వేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కే త్రిమూర్తులు, విశ్రాంత మండలాధికారి ప్రేమాకర్, నివాస ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గ్రంథాలయంలో 'చదవడం మా కిష్టం'

ప్రజాశక్తి-గొలుగొండ: ప్రతి ఒక్కరూ గ్రంథాల యాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ నిర్వహణ అధికారి రాజబాబు తెలిపారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రంథాలయ నిర్వహణతో విద్యార్థులకు కలిగే ఉపయోగాలను వివరించారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలతో పాటుగా, నిరుద్యోగులకు పోటీ పరీక్షలు అవసరమైన పుస్తకాలు కూడా గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రానికి చీరతో ప్రహరీ..!

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలోని వెంకటాపురం గ్రామంలో నిర్మించిన అంగన్వాడీ కేంద్రానికి ప్రహరీ గోడ లేక పోవడంతో విద్యార్థులకు రక్షణగా చీరలతో ప్రహరీ ఏర్పాటు చేశారు. అంగన్వాడీ కేంద్రం వద్ద పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేక పోవడంతో చిన్నారులకు రక్షణగా చీరలతో ప్రహరీ ఏర్పాటు చేశారు. సమీప ప్రాంతంలోనే బహిర్భూమికి పలువురు నిత్యం వెళ్తూ ఉండటంతో దుర్గంధం వెలువడుతోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి కేంద్రానికి ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టడంతో పాటు పరిసర ప్రాంతాల పట్ల పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న బిసి కాలనీ వాసులు

మంచినీళ్లివ్వండి మహాప్రభో!

- చింతూరు బిసి కాలనీ వాసుల గోడు

ప్రజాశక్తి - చింతూరు : డివిజన్ కేంద్రం చింతూరులోని బిసి కాలనీలో గడచిన పదిరోజులుగా తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆవేదన చెందుతున్నారు. సంబంధిత పంచాయతీ అధికారులను అడిగితే స్పందన లేదన్నారు. పోనీ చేతిబోరుల వద్దకు వెళ్లి నీరు తెచ్చేకుందామంటే అవీ మరమ్మతుకు గురై ఉన్నాయన్నారు. చింతూరు డివిజన్ కేంద్రంలోని పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే మారుమూల గిరిజన ప్రాంతాల తాగునీటి వ్యవస్థ ఎలా ఉందో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పంచాయితీ కార్యదర్శి, ఇతర సిబ్బంది ఉన్నారో లేరో తెలియడం లేదని, కనీసం ప్రజల సమస్యను వినే పరిస్థితికూడా లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని, లేకుంటే ఖాళీబిందెలతో ఐటిడిఎ పిఒ, ఇతర ఉన్నతాధికారుల కార్యాలయాల వద్ద నిరసన చేపట్టక తప్పదని హెచ్చరిస్తున్నారు

చోరీకి గురైన విగ్రహాల సమాచారమిస్తే నగదు బహుమతి

ప్రజాశక్తి- విఆర్ పురం: రెండో భద్రాద్రిగా ప్రసిద్ధ చెందిన మండలంలోని శ్రీరామగిరి కొండపై ఉన్న శ్రీసుందర సీతారామ చంద్ర స్వామి ఆలయంలో గతనెల 27న చోరీకి గురైన విగ్రహాల సమాచారమిస్తే పోలీసుశాఖపరంగా వారికి నగదు బహుతిని ఇవ్వనున్నట్లు చింతూరు క్రైం డివిజన్ పోలీసులు వెల్లడించారు. శ్రీరామగిరి ఆలయంలోని పురాతన దేవుని ఉత్సవ ఊరేగింపు విగ్రహాలైన గరుడ వాహనం, అశ్వ వాహనం, ఆంజనేయ స్వామి వాహనం విగ్రహాలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయారన్నారు. దీనికి సంబంధించి ఎటువంటి సమాచారం తెలిసినా వెంటనే క్రైమ్ పోలీసులకు తెలియజేయాలని, సమాచారమిచ్చిన వారికి రూ.పది వేలు నగదు బహుమతి అందజేస్తాన్నారు అలాగే సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. చోరీకి గురైన పురాతన ఉత్సవ విగ్రహాల సమాచారమిస్తే క్రైం పోలీస్ చింతూరు డివిజన్ సిఐ యటపాక 9490617848, యస్ ఐ విఆర్ పురం 9490617851, క్రైం పార్టీ పోలీసులు 9490345944, 9848322399, 9492950176 మొబైల్ నెంబర్లకు సమాచారమివ్వాలని కోరారు.


స్పోర్ట్స్ ప్రతినిధులతో సమావేశమైన ఎస్ఐ ప్రశాంత్‌కుమార్

జెన్‌కో స్పోర్ట్స్ జనరల్ సెక్రటరీ నియామకం

ప్రజాశక్తి -సీలేరు: ఎపి జెన్‌కో స్పోర్ట్స్ జనరల్ సెక్రెటరీగా సీలేరు ఎడిఇ కె..శ్రీనివాసరావు నియమితులయ్యారు. గతంలో స్పోర్ట్స్ జనరల్ సెక్రెటరీగా ఉన్న ఇఇ లక్ష్మీనారాయణ నెల్లూరు కృష్ణపట్నం ధర్మల్ పవర్ స్టేషన్‌కు బదిలి పై వెళ్లిపోయారు. దీంతో ఖాళీగా ఉన్న ఆ పదవిని భర్తీ చేయడానికి ఆదివారం సీలేరు కాంప్లెక్స్ ఎపి జెన్‌కో ఎస్ఇ కెకెవి. ప్రశాంత్‌కుమార్ అధ్యక్షతన స్పోర్ట్స్ సొసైటీ సభ్యులు, కె.శ్రీనివాసరావును స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రెటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అకౌంట్ అధికారి ఇవివి. సత్యనారాయణ, సబ్ ఇంజనీర్ శ్రీనివాస్, 1104 కార్మిక యూనియన్ రీజనల్ అధ్యక్షుడు వై.సత్తిబాబు, జి .శివప్రసాద్, ఎఎల్.రాజశేఖర్ పాల్గొన్నారు.

ఉచితం అనుచితమే..!

స్థానిక నదుల్లో లేని ఇసుక రీచ్‌లు
డిపోలపైనే ఆధారం
ధరతో పాటు తప్పని రవాణా భారం
నేటి నుంచి ఉచిత ఇసుక


నక్కపల్లిలోని ఇసుక డిపో

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ఉచిత ఇసుక విధానం సోమవారం నుంచి అమల్లోకి రానుంది. శారద, వరహా, తాండవ నదుల్లో ఇసుక రీచ్‌లు లేకపోవడంతో ఇప్పటివలె భవిష్యత్తులోనూ నిర్మాణ అవసరాలకు ఇతర ప్రాంతాలపైనే ఆధారపడాల్సివుంది. ప్రస్తుతం జిల్లాలో నర్సీపట్నం, నక్కపల్లిల్లో డిపోల్లోని ఇసుకకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అధికారులు ధర నిర్ణయించారు. నర్సీపట్నం డిపోలో టన్ను ఇసుక రూ.1060, నక్కపల్లిలో టన్ను ఇసుక రూ.1250 చొప్పున దరఖాస్తు ప్రాధాన్యతా క్రమంలో విక్రయించనున్నారు. జిల్లాలో ఇసుక రీచ్‌లు లేక ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా వంశధార, తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి గోదావరి నదుల నుంచి ఇసుక తెప్పించి నర్సీపట్నం, నక్కపల్లి డిపోల ద్వారా విక్రయిస్తున్నారు. ప్రస్తుతమున్న ఇసుక నిల్వలు పూర్తయ్యాక భవిష్యత్తులో ఈ నదుల నుంచి ఇసుక తెప్పించి వాటి దూరం ఆధారంగా ధర నిర్ణయించి ప్రభుత్వం ఇసుక సరఫరా చేయనుంది. ప్రజల ఇబ్బందులను గుర్తించి ప్రస్తుతమున్న రెండు డిపోలు సరిపోకపోతే మరో రెండు, మూడు ఇసుక డిపోలు ఏర్పాటుచేయనున్నారు. నిర్మాణ డిమాండ్‌ను బట్టి అనకాపల్లి, చోడవరం ప్రాంతాల్లో ఇసుక డిపోలు ఏర్పాటుచేసే ఆలోచనలో అధికారులున్నారు. ప్రజల అవసరాలకు తగినట్లు డిపోలు అందుబాటులో పెట్టకపోతే ఇసుక ధరతో పాటు రవాణా ఖర్చు తడిసిమోపెడు కానుంది. రవాణా భారం తగ్గించేందుకు అందుబాటులో ఇసుక డిపోలు ఏర్పాటుచేయాల్సివుంది. జిల్లాలోని నదులు, గెడ్డల్లో భారీ స్థాయిలో ఇసుక తరలింపునకు అవకాశం లేకపోవడంతో స్థానికంగా సొంత ఇంటి నిర్మాణ అవసరాలకు తహశీల్దార్ అనుమతితో ఎండ్ల బండ్లలో ఇసుక తీసుకెళ్లాల్సివుంది. స్థానిక అవసరాల పేరుతో ఇసుక అక్రమ తరలింపు, అమ్మకాలు చేసిన వారిపై చర్యలు తీసుకొనే వ్యవస్థను ప్రభుత్వం పటిష్టం చేయనుంది. జిల్లా స్థాయిలో కలెక్టర్ ఛైర్మన్‌గా, జాయింట్ కలెక్టర్, ఎస్‌పి, జిల్లా పంచాయతీ, ఇరిగేషన్, మైన్స్, స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ విభాగ అధికారులతో జిల్లా స్థాయి కమిటీని ప్రభుత్వం ఏర్పాటుచేసింది.

పోలీస్ కమిషనరేట్‌లో రికవరీ మేళా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ సిటీ పోలీస్ కమిషనరేట్‌లో జూన్ నెల రికవరీ మేళాను ఆదివారం నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రాత బాగ్చి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగింది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ విశాఖలో 99 దొంగతనాలు జూన్ నెలలో చోటు చేసుకున్నాయని, ఆ కేసులలో రూ.78,60,266 విలువగల సొత్తును దోచుకుని వెళ్లారని తెలిపారు. వాటిలో జాయింట్ కమిషనర్ ఫకిరప్ప సారథ్యంలో 80 కేసులను ఛేదించామన్నారు. రూ.37,12,715 నగదు, 381.93 గ్రాముల బంగారం, 501.36 గ్రాముల వెండి, ఒక ఆటో, 24 ద్విచక్ర వాహనాలు, ఒక కారు, 12 మొబైల్ ఫోన్లు, ఒక కెమెరా, 135.9 కేజీల కాపర్ వైర్, 20 కేజీల అల్యూమియం వైర్, తదితరాలను రికవరీ చేశామని తెలిపారు. జూన్ నెలలో 338 సిసి కెమెరాలు నగర వ్యాప్తంగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రానున్న రోజుల్లో వీటిని మరింత విస్తృతంగా ఏర్పాటు చేస్తామన్నారు. చాట్ బాట్ సర్వీస్ ద్వారా నగర పరిధిలో పోగొట్టుకున్న రూ.41.25 లక్షల విలువగల 275 మొబైల్ ఫోన్లను తిరిగి కనుగొన్నామని తెలిపారు. సమావేశంలో డాక్టర్ కె.ఫకీరప్ప పాల్గొన్నారు.

ఐటి దాఖలు మరింత సులభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఐటి దాఖలు మరింత సులభం చేసే క్రమంలో దేశంలోనే మొట్టమొదటి మొబైల్ యాప్ మై ఐటి రిటర్న్‌ను స్కోరిడోవ్ వ్యవస్థాపకులు సాకార్ యాదవ్ బీచ్ రోడ్డులోని పార్క్ హోటల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయులు తమ ఆదాయపు పన్ను రిటర్న్‌లను దాఖలు చేయడాన్ని స్కోరిడోవ్ సులభతరం చేసిందని తెలిపారు. myITreturn అనే ఈ సరికొత్త మొబైల్ యాప్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ యాప్‌లో వినియోగదారులు ఎలాంటి భౌతిక పత్రాలనూ అప్‌లోడ్ చేయనవసరం లేకుండా వారి స్మార్ట్ ఫోన్ల నుండి నేరుగా పన్నులను ఫైల్ చేయడానికి వీలు కలుగుతుందన్నారు. మునుపటి కంటే వేగంగా, మరింత సమర్థవంతంగా సేవలు ఉంటాయన్నారు. ఈ యాప్‌ను వినియోగదారున్ని దృష్టిలో పెట్టుకుని రూపొందించామన్నారు.

సచివాలయ సిబ్బందికి అందుబాటులో ఉంటా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సచివాలయ సిబ్బందికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం గ్రామ వార్డు సచివాలయం ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పివి.కిరణ్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాసును మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకష్ణ శ్రీనివాస్ మాట్లాడారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ విశాఖ జిల్లా అధ్యక్షులు పిజె.గణేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి అనిమిరెడ్డి రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ బివి.అశోక్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఇ.పవన్ కుమార్, జాయింట్ సెక్రటరీ బంగారు రాజు, నాయకులు సురేంద్ర, రాజు, ఒమ్మి వెంకట యాదవ్ పాల్గొన్నారు.


గ్రామ వీధుల్లో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

సీలేరులో ముమ్మరంగా ఫాగింగ్

ప్రజాశక్తి - సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో దోమల నివారణకు పంచాయతీ కార్యదర్శి వి. శ్రీనివాస్, సర్పంచ్ దుర్గ చర్యలు చేపట్టారు. ఆదివారం సాయంత్రం సీలేరు మార్కెట్ పురవీధుల్లో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉన్నత పాఠశాలలో జోరుగా పాగింగ్ చేశారు. సిపిహెచ్ క్యాంప్ కన్నబ్బాయి క్యాంప్‌లో ఫాగింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ సర్పంచ్, కార్యదర్శి మాట్లాడుతూ సీజనల్‌వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఇంటి పరిసరాల్లో మురుగు గుంతలు లేకుండా చూడాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు, వాటి లార్వాలు వృద్ధి చెందడానికి ఆవాసమైన మురుగు, మంచినీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు.. సీలేరు గ్రామపంచాయతీ పరిధిలో ప్రతిరోజు పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నామని, ప్రజలు సహకరించి పరిశుభ్రతలో భాగస్వాములు కావాలని కోరారు. దోమల నివారణకు సహకరించాలనానరు. సమస్యలుంటే తన దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు.


మొక్కలు నాటుతున్న అనుదీప్ తదితరులు

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి - మారేడుమిల్లి : పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణకు ప్రతిఒక్కరూ మొక్కలను నాటాలని వనవాసి సంస్థ డైరెక్టర్ గొర్లె అనుదీప్‌కుమార్ అన్నారు .ఆదివారం మండలకేంద్రం మారేడుమిల్లి గ్రామంశివారు ప్రాంతంలో పర్యావరణం పరిరక్షణ, పచ్చదనంలో భాగంగా ఆదివారం రోడ్డుకు ఇరువైపులా సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల జీవవైవిధ్యం సాధ్యపడుతుందన్నారు. మితిమీరిన కాలుష్యంతో మానవాళి మనుగడ ప్రశ్నార్థకం కాకుండా ఉండాలంటే ప్రతి ఇంటా, ఆరుబయట వీలైనన్ని మొక్కలను నాటడంతోపాటు వాటిని సంరక్షించే బాధ్యతను ప్రనతిఒక్కరూ చేపట్టాలని పిలుపునిచ్చారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి - రంపచోడవరం : స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవిని ఆదివారం 108 ఉద్యోగుల అసోసియేషన్ అల్లూరి జిల్లా కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించి, పరిష్కారానికి చొరవ చూపాలని విన్నవించారు. ఉద్యోగ భద్రతతోపాటు సమానపనికి సమానవేతనం, రెగ్యులర్‌గా వేతనం, ఇతర సౌకర్యాలు అమలుపై ప్రభుత్వం దృష్టికితీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే శిరీషాదేవి స్పందిస్తూ, సమస్యను పార్టీ అధిష్టానం, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.